కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశానికి హాజరైన స్పెషల్ ఆఫీసర్లు, తాసీల్దార్లు, ఎండీఓలు

నేటి నుంచి ప్రజా పాలన

జనవరి 6వ తేదీ వరకు గ్రామాలు, పట్టణాల్లో సభలు

- ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తులు
- రోజుకు రెండు గ్రామాల్లో సభలు
- 51బృందాలతో 1961కౌంటర్ల ఏర్పాటు
- ప్రశాంత వాతావరణంలో దరఖాస్తులు తీసుకోవాలి
- సమీక్షా సమావేవంలో కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచన

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో 2,18,807 కుటుంబాలకు సంబంధించి 51 బృందాలతో ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచించారు. మున్సిపాలిటీల్లో 14, రూరల్‌లో 37 బృందాలను నియమించడంతో పాటు, దరఖాస్తుల స్వీకరణను 1961కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎలాంటి రద్దీ, హడావుడీ లేకుండా ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. రోజుకు రెండు గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు గ్రామ సభల ఏర్పాటుతో తగిన కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభించి ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించాలని సూచించారు. ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు స్వీకరించాలని, దరఖాస్తులో ఉన్న 5 పథకాలపై ఒకే దరఖాస్తు ద్వారా స్వీకరించాలని వివరించారు.

నాలుగు నెలలకోసారి ప్రజా పాలన

గ్రామ సభలో తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మైక్ ఏర్పాట్లు, టెంట్, కుర్చీలు, టేబుల్స్, క్యూలైన్ బారికేడింగ్స్, దరఖాస్తులు, మంచినీటి సౌకర్యం వసతులు కల్పించాలని సూచించారు. జీరాక్సు సెంటర్ల యజమానులు దరఖాస్తుల జీరాక్సుకు ఎక్కువ డబ్బులు వసూలు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏరోజు రిపోర్టు ఆ రోజు సాయంత్రం లోగా నిర్ణీత ప్రొఫార్మాలో నివేదికలు సమర్పించాలని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం తిరిగి నాలుగు నెలలకోసారి నిర్వహిస్తామని, ప్రభుత్వ పథకాలను పొందేందుకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. మండల స్పెషల్ ఆఫీసర్లు గ్రామ సభలకు సంబంధించిన ఏర్పాట్లను ముందు రోజే వెళ్లి పరిశీలించుకోవాలని, సాఫీగా దరఖాస్తులు స్వీకరించేలా ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. టామ్ టామ్, ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజలకు తెలిసేలా కార్యాచరణ ఉండాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి(స్థానిక సంస్థలు), అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎ.భాస్కర్‌రావు, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, జడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, భువనగిరి ఏసీపీ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఇతర అంశాలపై దరఖాస్తుల స్వీకరణ

ఐదు గ్యారెంటీ పథకాలపైనే గాక ఇతర అంశాలపై కూడా దరఖాస్తులు ఇస్తే స్వీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. తప్పనిసరిగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, రాయడం రాని వారికి దరఖాస్తులు రాసే విధంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. దరఖాస్తుల స్వీకరణలో వృద్ధులు, దివ్యాంగులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దరఖాస్తు స్వీకరించిన తడుపకి వెంటనే రసీదు ఇవ్వాలని సూచించారు. గ్రామ సభకు ఎవరైనా రాలేకపోతే జనవరి 6వ తేదీ వరకు మున్సిపల్ కార్యాలయం, గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఒక కౌంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. దరఖాస్తులు స్వీకరిస్తారనే విషయాన్ని ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ప్రజా పాలన ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా ఆర్‌వీ కర్ణన్

నల్లగొండ : నేటి నుంచి జనవరి 6 వరకు నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమానికి ఆర్‌వీ కర్ణన్‌ను బుధవారం ప్రభుత్వం ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా నియమించింది. కర్ణన్ ఇటీవల వరకు నల్లగొండ కలెక్టర్‌గా పనిచేసి రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజా పాలన ద్వారా వచ్చిన దరఖాస్తులను కర్ణన్ నేతృత్వంలో పరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

మన పోలీస్ భేష్

పిటిషన్ల పరిష్కారంలో యాదాద్రి జోన్ ముందంజ

10,839 పిటిషన్లలో 10,681 పరిష్కారం

17,584 ఈ-పెట్టి కేసుల్లో 15,495 డిస్పోస్డ్

35జీరో ఎఫ్ఐఆర్‌లు.. 49సైబర్ క్రైమ్ కేసులు

620మందికి ఫ్యామిలీ కౌన్సెలింగ్‌లు

డయల్ 100కు 32,147 కాల్స్

భువనగిరి సీసీఎస్‌లో రూ. 84.41లక్షల రికవరీ

అత్యాచార కేసుల్లో అత్యధికులు స్నేహితులే..

రాచకొండ పరిధిలో 16,594 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

వార్షిక నివేదిక -2023లో వెల్లడి

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : జిల్లా పరిధిలో ఈ ఏడాది 35 జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. జీరో ఎఫ్ఐఆర్ అంటే సంబంధిత పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లోనే గాక దగ్గరలోని ఏ పోలీస్‌స్టేషన్‌లోనైనా ఫిర్యాదు చేయడం. డయల్ 100కు 32,147 వివిధ రకాల కాల్స్ వచ్చాయి. సగటున 12.7నిమిషాలకు ఒక కాల్‌ను స్వీకరించారు. కొత్తగా పరిణమిస్తున్న సైబర్ క్రైమ్‌కు సంబంధించి 49 కేసులు నమోదయ్యాయి. ఇక 17,584 ఈ-పెట్టే కేసులు బుక్ కాగా 15,495 కేసులు పరిష్కరించారు. 6,687 మోడస్ ఆపరెండి క్రిమినల్స్‌ను చెక్ చేశారు. 289 మందికి ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లాలో 2,118 కమ్యూనిటీ సీసీ కెమెరాలు అమర్చారు.

భువనగిరి సీసీఎస్‌లో రూ.84.41లక్షల రికవరీ

భువనగిరి సీసీఎస్ పరిధిలో ఈ ఏడాది దొంగతాలు, చోరీలు, లూటీలకు సంబంధించి మొత్తం 84,41,900 సొమ్మును రికవరీ చేశారు. ఏడు డెకాయిటీ కేసులు నమోదవగా, 4,34,900 స్వాధీనం చేసుకున్నారు. 59 ఇండ్లలో దొంగతనాలు జరగ్గా, 45,97,500 సొమ్మును రికవరీ చేశారు. 21 సాధారణ దొంగతనాల కేసుల్లో 11,34,000, 13 ఆటో మొబైల్స్ దొంగతనాల కేసుల్లో 14,93,000 సొత్తును తిరిగి అప్పగించారు.

లైంగికదాడి కేసుల్లో నిందితులు స్నేహితులే

రాచకొండ కమిషనరేట్ పరిధిలో లైంగికదాడి కేసుల్లో పోలీసుల దర్యాప్తుల్లో విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయి. ఈ కేసుల్లో అధిక శాతం స్నేహితులే ఉన్నట్లు తేలింది. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది 327 లైంగిక దాడి కేసులు నమోదవగా, ఇందులో అత్యధికంగా స్నేహితులే ఈ దారుణాలకు పాల్పడినట్లు బయటపడింది. ఆ తర్వాత 12కేసుల్లో ఇరుగుపొరుగు వాళ్లు, ముగ్గురు కుటుంబసభ్యులు, 32మంది ఇతరుల ప్రమేయం ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. 2022తో పోలిస్తే 2023లో 12.10శాతం అత్యాచారాలు తగ్గుముఖం పట్టాయి.

16,594 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది మొత్తం 16,594 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదవగా ఇందులో 271 మంది జైలు శిక్ష అనుభవించారు. 3,89,14,176 కోట్ల ఫైనాల్టీ విధించారు. 16,819మందికి డ్రంకెన్ డ్రైవ్ కేల్లో కౌన్సిలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన కేసుల్లో 2,900మంది డ్రైవింగ్ లైసెన్సులు సస్పెన్షన్ చేశారు. ఇక హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసిన 12,80,306కి ఛలానా విధించారు. 1,17,906 ఓవర్ స్పీడ్, 4908 సెల్ ఫోన్ డ్రైవింగ్, 39,129 సిగ్నల్ జంప్, 1,21,644 నంబర్ ప్లేట్ సరిగా లేకపోవడం, 1,84,160 రాంగ్ సైడ్ డ్రైవింగ్, 22,316 త్రిబుల్ రైడింగ్, 40,084 నోఎంట్రీ ఉల్లంఘనలు, 74556 లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం, 10756 సీటు బెల్ట్ పెట్టుకోపోవడంపై చలానాలు విధించారు.

ఆరోగ్యం.. ఆదాయం

స్వయం ఉపాధిగా గానుగ నూనె పరిశ్రమ ఏర్పాటు

మార్కెట్‌లో నూనెకు మస్తు డిమాండ్

మంచి ఫలితాలు సాధిస్తున్న ముగ్గురు యువకులు

మారుతున్న కాలానుగుణంగా ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రత్యేకించి మనం రోజూ వినియోగించే నూనెల విషయంలో మరింత జాగ్రత్తలు వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రకృతి సిద్ధంగా తయారు చేస్తున్న గానుగ నూనె వినియోగానికి ఆసక్తి చూపుతున్నారు. చౌటుప్పల్ మండలంలోని కొయ్యలగూడెం 65వ నంబర్ జాతీయ రహదారి పక్కన ముగ్గురు యువకులు ఎద్దు గానుగ నూనె కేంద్రం ఏర్పాటు చేసి స్వచ్ఛమైన గానుగ నూనె అందిస్తున్నారు.

– చౌటుప్పల్, డిసెంబర్ 27

గానుగలో పట్టిన నూనెలు

చౌటుప్పల్ మండలంలోని పీపల్‌పహాడ్ గ్రామానికి చెందిన జనగాం ప్రవీణ్, సింగపంగ రంగయ్య, పంతంగి గ్రామానికి చెందిన చేకూరి బాబు నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యావంతులైన యువకులు. గతంలో ఉపాధికి ముంబయికి వెళ్లి కేబుల్ కంపెనీలో కూలీ పని చేసేవాళ్లు. కొన్ని రోజుల పాటు చేశాక కుటుంబసభ్యులను వదలి ఉండలేక తిరిగొచ్చారు. సొంత ఊరిలోనే ఏదైనా చేసి ఉపాధి పొందాలని ఆలోచించారు. తమకు ఆదాయంతో పాటు సమాజానికి అక్కరకొచ్చే పని చేయాలని అనుకున్నారు. ఈ క్రమంలో ఆలోచిస్తుండగా వీరికి ఎద్దుతో నడిచే చెక్క గానుగ అకట్టుకుంది. దీంతో మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ మండలం జక్కిప్‌పల్లిలో బసవరాజు ఎద్దు గానుగలను నిర్వహిస్తున్నారని తెలుసుకుని అక్కడికెళ్లారు. నూనె తీసే విధానం నేర్చుకోవడంతో పాటు దానికి కావాల్సిన ముడిసరుకు, గానుగకు సంబంధించిన పరికరాల గురించి తెలుసుకున్నారు. అనంతరం ముగ్గురు కలిసి రూ.15లక్షలు పెట్టుబడి పెట్టి వీటిని సమకూర్చుకుని మండలంలోని కొయ్యలగూడెం 65వ నంబర్ జాతీయ రహదారి పక్కన పెద్ద షెడ్డు నిర్మించారు. దాంట్లో రెండు గానుగలను ఏర్పాటు చేశారు. దీనికి ఎద్దులను పైతం సమకూర్చుకున్నారు.

రోజుకు 30లీటర్ల నూనె ఉత్పత్తి

రెండు ఎద్దు గానుగల ద్వారా వీరు ప్రతిరోజూ 30లీటర్ల నూనె ఉత్పత్తి చేస్తున్నారు. అక్కడే విని యోగదారులకు ప్రకృతి సిద్ధమైన నూనెలు విక్రయిస్తున్నారు. ప్రధానంగా కిలో వేరుశనగ నూనె రూ.450, కొబ్బరి రూ.540, నువ్వులు రూ.700 స్వచ్ఛమైన నూనెలు విక్రయిస్తున్నారు. ముడి సరుకులను ఇతర ప్రాంతాల నుంచి తెప్పిస్తున్నారు.

ఎద్దుతో నడిచే గానుగ నూనె

స్వయం ఉపాధి సాధిస్తున్నాం

స్వయం ఉపాధితో ఎదగాలని ముందుకొచ్చాం. అది సమాజానికి ఉపయోగపడాలని భావించాం. ఇందుకు ఎద్దు గానుగల నూనెల తయారీ ఎంచుకున్నాం. దీని కోసం రూ.15లక్షల పెట్టుబడి పెట్టాం. సొంతూరికి సమీపంలోనే ఉపాధి పొందుతున్నాం. ఖర్చులన్నీ పోను నెలకు ముగ్గురం కలిపి రూ.1లక్షకు పైగా సంపాదిస్తున్నాం.

– మిత్రులు బాబు, రంగయ్య, ప్రవీణ్

ఎగ్జిబిషన్ ప్రధాన మార్గం

ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేస్తున్న అమ్యూజ్‌మెంట్ పార్క్

జనవరి 1 నుంచి నుమాయిష్

- 46 రోజుల పాటు కొనసాగనున్న ఎగ్జిబిషన్
- దాదాపు 2400 స్టాళ్ల నిర్మాణం
- కొలువుదీరనున్న పారిశ్రామిక ఉత్పత్తులు, ఫుడ్ కోర్టులు, అమ్యూజ్‌మెంట్ పార్కులు
- వేగంగా కొనసాగుతున్న స్టాళ్ల నిర్మాణ పనులు
- విజయవంతంగా నిర్వహించేందుకు సొసైటీ ప్రతినిధులు కృషి
- విద్యావ్యాప్తికి కృషి చేస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ

అబిడ్స్, డిసెంబర్ 27: దేశంలోని వివిధ ప్రాంతాల్లో తయారైన పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు చేపట్టేందుకు నగరంలో నిర్వహించనున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన(ఎగ్జిబిషన్) ఏర్పాట్లు చురుకుగా కొనసాగుతున్నాయి. ప్రతి సంవత్సరం జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 15 వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన నిర్వహిస్తారు. ఇందులో దాదాపు 2400 స్టాళ్ల నిర్మాణం చేసేందుకు నిర్వాహకుల నుంచి దరఖాస్తులను స్వీకరించడంతో పాటు స్టాళ్ల కేటాయింపు చివర దశకు చేరుకుంది. ఇప్పటి వరకు స్టాళ్లను పొందిన నిర్వాహకులకు స్టాళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. జనవరి 1 ప్రారంభం నాటికి దాదాపు అన్ని స్టాళ్ల ఏర్పాట్లు పూర్తయ్యేలా ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు నేతృత్వంలో సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి ఈ.రాజేందర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. 1938 సంవత్సరంలో ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ నేతృత్వంలో ప్రారంభమైన ఈ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన అప్పట్లో నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించే వారు. ఆ తరువాత 1946లో నాంపల్లి లోని ఎగ్జిబిషన్ మైదానం లోని 26 ఎకరాల సువిశాలమైన స్థలంలో నిర్వహిస్తూ వస్తున్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్‌కు దేశ, విదేశాల్లో ప్రాముఖ్యత సంతరించుకుంది. ప్రతి సంవత్సరం జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 15 వరకు 46 రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌కు ప్రజాదరణ ఉంది. దీంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తయారు చేసిన ఉత్పత్తులకు విస్తృత ప్రచారం లభించడంతో వాటి విక్రయాలకు కేంద్రంగా నిలిచింది. ప్రతి సంవత్సరం దాదాపు 25 లక్షల మంది సందర్శకులు ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తారు. సుమారు 2400 స్టాళ్ల ఏర్పాటుతో కొనసాగే ఈ ఎగ్జిబిషన్ నగర ప్రజలనే కాకుండా పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి సందర్శకుడు వచ్చే వారిని అలరిస్తోంది. పలు పారిశ్రామిక ఉత్పత్తులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల స్టాళ్లు, ఫుడ్ కోర్టులు, సందర్శకులను అలరించేందుకు అమ్యూజ్‌మెంట్ పార్క్ ఇలా అనేక స్టాళ్లు ఎగ్జిబిషన్‌లో కొలువుదీరనున్నాయి. ఇప్పటికే దాదాపు స్టాళ్ల కేటాయింపులు పూర్తి కావస్తుండటంతో పలు స్టాళ్ల నిర్మాణానికి ఏర్పాట్లు సాగుతున్నాయి.

స్టాల్ నిర్మాణ పనులను చేపడుతున్న కార్మికులు

ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేసేందుకు చర్యలు..

మొత్తం 32 సబ్ కమిటీలను ఏర్పాటు చేసి ఆయా కమిటీల సహకారంతో ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేసేందుకు సొసైటీ ప్రతినిధులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రవేశ రుసుము గత సంవత్సరం మాదిరిగానే రూ.40 నిర్ణయించడంతో పాటు క్షణాల్లో ఎగ్జిబిషన్‌ను చుట్టుముట్టి వచ్చేందుకు ఏర్పాటు చేసిన మినీ ట్రైన్‌కు రూ.30 ధరను నిర్ణయించారు. గత సంవత్సరం దాదాపు 25 లక్షల వరకు సందర్శకులు ఎగ్జిబిషన్‌ను సందర్శించగా, ఈ సంవత్సరం అంతకంటే ఎక్కువ మంది సందర్శకులు తరలి వచ్చేలా సొసైటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది.

రాష్ట్రంలో మహిళా విద్యా వ్యాప్తికి కృషి

ఎగ్జిబిషన్ నిర్వహణ ద్వారా వస్తున్న ఆదాయంతో ఎగ్జిబిషన్ సొసైటీ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విద్యా వ్యాప్తికి కృషి చేస్తోంది. ముఖ్యంగా మహిళా విద్యా వ్యాప్తికి గాను మహిళా కళాశాలలు, పాలిటెక్నిక్, ఫార్మసీ, ఇంజినీరింగ్, డీఫా, బీఎడ్ కళాశాలలను స్థాపించి విద్యా వ్యాప్తికి పాటు పడుతోంది. పలు జిల్లాల్లో ఎగ్జిబిషన్ ఆధ్వర్యంలో 20 విద్యా సంస్థలు కొనసాగుతున్నాయి. ప్రతి సంవత్సరం ఆయా విద్యా సంస్థల ద్వారా దాదాపు 30 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

స్టాళ్ల ఏర్పాట్లు కొనసాగుతున్నాయి..

జనవరి 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు వచ్చే సందర్శకుల కోసం మరిన్ని వసతులు కల్పిస్తున్నాం. ఎగ్జిబిషన్‌ను పురస్కరించుకొని స్టాళ్ల ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. 32 సబ్ కమిటీలను ఏర్పాటు చేసి సందర్శకులకు అన్ని విధాల సౌకర్యాలను కల్పించి, ఎగ్జిబిషన్ విజయవంతం అయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– వనం సత్యేందర్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు

కనువిందు చేసేలా..

జనవరి 1వ తేదీ నుంచి నుమాయిష్ ప్రారంభం కానున్నది. నుమాయిష్‌కు నగరం నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా సందర్శకులు వస్తారు. కనువిందు చేసేందుకు మైదానంలో అమ్యూజ్‌మెంట్ పార్క్‌లు, స్టాళ్ల ఏర్పాటు జరుగుతున్నది. ప్రారంభోత్సవం నాటికి దాదాపు స్టాళ్ల ఏర్పాట్లు పూర్తయ్యేలా చూస్తున్నాం.

– ఏనుగుల రాజేందర్, సొసైటీ కోశాధికారి

సందర్శకులకు మరిన్ని వసతులు

ఎగ్జిబిషన్ నిర్వహించే 46 రోజుల పాటు సందర్శకులకు అన్ని రకాల వసతులు కల్పిస్తాం. సందర్శకులకు తక్కువ ధరలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నాం. ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక సెక్యూరిటీతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నాం. అంతర్గత భద్రతతో పాటు పోలీసుల ద్వారా ప్రత్యేక భద్రత చర్యలు తీసుకుంటున్నాం.

– హనుమంతరావు, ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి